అమరుల ఆకాంక్షలు నెరవేరేలా

- ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి
- రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు : కాసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సకల జనుల అలుపెరుగని పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని అభిప్రాయపడ్డారు. ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం విషయంలో ప్రతిపక్షాలకూ పెద్దపీట దక్కకపోవడం అన్యాయమని చెప్పారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పతనం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం స్ఫూర్తితో సబ్బండ వర్ణాలు మమేకమవుతూ అమరవీరుల ఆకాంక్షలు ఫలించేలా దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాసాని జ్ఞానేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మళ్లీ పెరిగిన ఎండలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు రోజులుగా చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కింది. ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటాయి. ఈ వారంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో అత్యధికంగా 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశముంది.

బోధించు.. సమీకరించు.. పోరాడు..

- ఇదే తెలంగాణ ఉద్యమ పంథా
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్వయం పాలన తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదవ వసంతంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంలో, తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు, పదవ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ కోసం వివిధ దశల్లో సాగిన పోరాటాలను, ఉద్యమాలను, త్యాగాలను రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సిఎం కెసిఆర్ స్మరించుకున్నారు. రాష్ట్ర ఏర్పాటు దిశగా భావజాలాన్ని వ్యాప్తిచేస్తూ ప్రజలను మమేకం చేస్తూ మలిదశ ఉద్యమాన్ని పార్లమెంటరీ పంథాలో ప్రజాస్వామ్య పోరాటం దిశగా మలిపిన తీరును సిఎం గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధన పోరాట క్రమంలో తాను ఎదుర్కొన్న కష్టాలను, అవమానాలను, అధిగమించిన అడ్డంకులను, సిఎం కెసిఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, వేలాది సభలను నిర్వహిస్తూ, సబ్బండ వృత్తులను సకల జనులను సమీకరిస్తూ, సమన్వయ పరుస్తూ, అందరి భాగస్వామ్యం సహకారంతో, శాంతియుత పద్ధతిలో పోరాటాన్ని కొనసాగించి, కేంద్రం మెడలు వంచి

రాష్ట్రాన్ని సాధించిన మొత్తం ప్రక్రియను, ఈ క్రమంలో సహకరించిన వారినందరినీ సిఎం గుర్తు చేసుకున్నారు. విజయతీరాలకు చేరుకున్న ఈ మొత్తం ఉద్యమ ప్రస్థానంలో ఇమిడివున్న.. నిర్థిష్ట పరిస్థితులకు అనుసరించిన నిర్థిష్ట కార్యాచరణను, 'బోధించు సమీకరించు పోరాడు' అనే పంథా ద్వారా సాధించిన విజయాన్ని సిఎం కెసిఆర్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్మరించుకున్నారు.

తొమ్మిదేళ్ల క్రితం 2014 జూన్ 2 నాడు భారత దేశంలో 29 వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ,. అనుమానాలను పటాపంచలు చేస్తూ, బాలారిష్టాలను దాటుకుంటూ, ప్రత్యర్థులు కుయుక్తులను తిప్పికొడుతూ నిలదొక్కుకోవడం అత్యద్భుతమని సిఎం అన్నారు. ఒకనాడు వెనకబాటుకు గురయిన తెలంగాణ నేడు సమస్త రంగాలలో దేశాన్ని ముందుకు తీసుకుపోతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి, ప్రజలందరి భాగస్వామ్యంతో, ఈ తొమ్మిదేళ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శవంతంగా నిలవడం పట్ల సిఎం కెసిఆర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మున్నెన్నడూ ఎరుగని రీతిలో 'తెలంగాణ మోడల్' పాలన దేశ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలంగాణ వంటి పాలన కావాలని,' అన్ని రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారని, ఈ దిశగా దేశ ప్రజలందరి ఆదరాభిమానాలను చూరగొనడం తెలంగాణ ప్రజలు సాధించిన ఘన విజయమని సిఎం పేర్కొన్నారు. ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ గర్వించాల్సిన గొప్ప సందర్భమిదని అన్నారు.

వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, సంక్షేమం, ఆర్థిక రంగం సహా సమస్త రంగాలలో గుణాత్మక అభివృద్ధి సాధిస్తూ, మహోజ్వల స్థితికి చేరుకుంటున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని మూడు వారాల పాటు అంగరంగ వైభవంగా, పండుగ వాతావారణంలో జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఫలాలను ఆస్వాదిస్తున్న ఆనందరకర సమయంలో తమ సంతోషాలను పంచుకుంటూ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములై రాష్ట్ర ప్రజలందరూ వాడ వాడనా సంబురాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

వడ్లు ఎండకు ఎండి.. వానకు నానుతున్నయ్..

- రైతన్నల ఆగ్రహం.. రోడ్డుపై ముళ్ల కంచె వేసి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం తూక వేయడంలో, మిల్లులకు తరలించడంలో జాప్యం చేయడంతో వడ్లు ఎండకు ఎండి వానకు నానుతున్నాయని ఆగ్రహించిన రైతులు గురువారం ఆందోళన చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలోని ప్రధాన రహదారిపై మండుటెండలో ముళ్ల కంచె వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 15 రోజులుగా ధాన్యం తూకం వేయకుండా కాలయాపన చేస్తున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని కూడా సకాలంలో మిల్లుకు తరలించడం లేదన్నారు. లారీ డ్రైవర్లు బస్తాకు రూ. రెండు చొప్పున వసూలు చేస్తున్నారని, బస్తాకు రెండు నుంచి మూడుకిలోలు అధిక తూకం వేస్తున్నారని వాపోయారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు రోజుల తరబడి కేంద్రాల్లో ఉండటం వల్ల తరుగు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో వచ్చి కొనుగోలు కేంద్రానికి రోజువారీగా లారీలు పంపించేందుకు అధికారులతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- భార్య, భర్త, కుమారుడు మృతి
- మరో కుమారుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. ఈ ఘటనలో భార్య, భర్తతో పాటు కుమారుడు మృతిచెందారు. మరో కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వైరా మండలం విప్పలమడక గ్రామానికి చెందిన పారుపల్లి రాజేష్ (38), సుజాత (34) దంపతులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. కాగా, ఆ కుటుంబమంతా తమ కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో కొణిజర్ల వద్ద వారి కారు ముందు వెళ్తున్న లారీ ముందు మరో వాహనం మరమ్మతులకు గురై ఆగి ఉండటంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో రాజేష్ కూడా తన కారు వేగం తగ్గించి లారీ వెనక ఆపాడు. అది గమనించని రాజేష్ కారు వెనుక వస్తున్న మరో లారీ డ్రైవర్ వేగంగా వచ్చి కారును ఢీ కొట్టడంతో రెండు లారీల మధ్య కారు నుజ్జునుజ్జు అయింది. నలుగురూ కారులో ఇరుక్కున్నారు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే రాజేష్, సుజాతలతో పాటు కుమారుడు అశ్విత్ (8) మరణించారు. విషయం తెలుసుకున్న ఎసిపి రెహమాన్, సిఐ, ఎస్ఐ, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని కారులో ఇరుక్కున్న మృతదేహాలను ప్రొక్లెయిన్ సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ముగ్గురి మృతదేహాలను చూసి వైరా ఎమ్మెల్యే రాములునాయక్ కన్నీటిపర్యంతమయ్యారు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

జులైలో టిసిఇఐ అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్ : దేశంలోని అతిపెద్ద రీజినల్ ఈవెంట్స్ అసోసియేషన్‌లలో ఒకటైన తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టిసిఇఐ) జులై 24, 25 తేదీల్లో "టిసిఇఐ ఎస్ఐడబ్ల్యుపిసి గ్లోబల్ 2023" పేరుతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపింది. సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సులో ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. దీనికి తెలంగాణ టూరిజం మద్దతు ఇస్తుందని టిసిఇఐ ప్రెసిడెంట్ బలరామ్ బాబు తెలిపారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సులో భారతీయ వివాహ పరిశ్రమలోని వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకే చోటకు చేర్చనున్నామన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు మరో డిఎ

- జూన్ నెల వేతనంతో కలిపి చెల్లింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులకు ఆర్‌టిసి యాజమాన్యం తీపికబురు అందించింది. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మరో డిఎ ఇవ్వాలని ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించింది. జూన్ నెల వేతనంతో కలిపి డిఎ చెల్లించనుంది. ఉద్యోగులకు డిఎ ఇస్తున్నట్లు ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లో ప్రకటించారు.

జులై 2022 లో ఇవ్వాల్సి ఉన్న 4.9 శాతం డిఎను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల వేతనంతో కలిపి డిఎను ఉద్యోగులకు సంస్థ చెల్లిస్తుందని ప్రకటించారు.

తెలంగాణ ఉద్యమంలో టిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు క్రియాశీల పాత్ర పోషించారు. 2011లో దాదాపు 29 రోజుల పాటు సకల జనుల సమ్మెలో పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కానుకగా పెండింగ్‌లో ఉన్న ఏడో డిఎను ఉద్యోగులకు మంజూరు చేయాలని టిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించింది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇప్పటివరకు ఏడు డిఎలను సంస్థ మంజూరు చేసింది. మిగిలిన ఒక్క డిఎను త్వరలోనే ఉద్యోగులకు ప్రకటిస్తామని చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, సంస్థ ఎండి విసి సజ్జనర్ తెలిపారు.

జిఓ 111 పరిరక్షణకు ఉద్యమిద్దాం

- ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం వీడాలి
- ఎంపి ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఓ 111 పరిరక్షణకు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మౌనం వీడి న్యాయపోరాటం చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లోని విద్యానగర్ బిసి భవన్‌లో 111 జిఓ పరిరక్షణకోసం బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 111 జిఓ పరిరక్షణ ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎందుకు నోరువిప్పటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. జీవో 111 పై బిజెపి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అవినీతిపై ప్రధానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రూ. రెండు లక్షల కోట్ల అవినీతి జరిగే అవకాశం ఉందని, సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెరువులను కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి మాట్లాడుతూ. జిఓ 111 ద్వారా హైదరాబాద్ సురక్షితంగా ఉందని గుర్తుచేశారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు కెసిఆర్ ప్రభుత్వం జిఓ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకోవటం దుర్మార్గమని విమర్శించారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమేంటని ప్రశ్నించారు. లక్షల కోట్ల రూపాయలు దోపిడి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వాధినేతలు, మంత్రులు ఐటిఐ పరిధిలో సొంత ఇండ్లు, ఫాం హౌస్‌లు కట్టుకొని వరదలు వస్తే అధికారులను బెదిరించి తూములు వదులుతున్నారని గుర్తుచేశారు. ఈ దీక్షలో టిడిపి సీనియర్ నాయకులు సాయిబాబా, బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, లాల్ కృష్ణ, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో తెలంగాణను లిక్కర్ రాష్ట్రంగా మార్చారని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.70వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ప్రతి ఒక్కరి తలపై రూ.లక్షన్నర అప్పు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ గన్‌పార్కు వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన షర్మిల.. మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌కు షర్మిల 10 ప్రశ్నలు సంధించారు. ఆ ప్రశ్నలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. "అవినీతి సొమ్మంతా సిఎం కెసిఆర్ దగ్గరే ఉంది. ప్రజలకిచ్చిన అన్ని హామీలను సిఎం తుంగలో తొక్కారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. నా పార్టీని మరో పార్టీలో విలీనం చేస్తానని కొందరు మాట్లాడుతున్నారు. అలా మాట్లాడుతూ ఓ మహిళ కష్టాన్ని అవమానించొద్దు. అభ్యర్థులను తయారు చేసుకుని ఎన్నికల్లో పోటీకి నిలబెడతా. బిఆర్ఎస్‌తో మేం ఎప్పటికీ పొత్తు పెట్టుకోం. పొత్తులపై బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి కూడా స్పష్టత ఇవ్వాలి. నేను చేరతానంటే కాదనే పార్టీ ఏదైనా ఉందా? వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చే అవకాశం లేదు. ఎన్నికల తర్వాత భారాసతో పొత్తు ఉండబోదని కాంగ్రెస్ స్పష్టం చేయాలి" అని షర్మిల పేర్కొన్నారు.

మక్కలను నిరాకరించిన గోదామ్ సిబ్బంది

- కొనుగోలు కేంద్రానికి తిరిగొచ్చిన లారీ
- బస్తాలను దించితే ఆత్మహత్య చేసుకుంటానన్న రైతులు బెదిరింపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన మక్కల్లో తెల్ల పురుగుతోపాటు ఫంగస్ సోకిందని పరకాల ఏఎంసీ గోదాము ఇన్‌చార్జి మక్కలను తిరిగి కొనుగోలు కేంద్రానికి పంపించడంతో ఆగ్రహించిన రైతులు.. లారీ ఎక్కి మక్కల బస్తాలను దిగుమతి చేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. గత్యంతరం లేక హమాలీలు లారీలో నుంచి దిగి కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సమాచారం అందించారు. ఈ ఘటన హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మే 8న కొనుగోలు కేంద్రం ప్రారంభించగా.. అదే రోజు మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రైతులు శ్రీరాముల మహేందర్, పల్లెబోయిన రాజు, దూదిపాల రాజిరెడ్డి, సిరిపురం లక్ష్మయ్య, జక్కుల నరేష్, మోతే ప్రభాకర్‌కు చెందిన మక్కలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. కాగా 16న వాటిని తూకం వేయగా.. లారీల కొరతతో గోదాముకు ఎగుమతి చేయలేదు. ఆ తర్వాత రెండుసార్లు కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని మక్కలు తడిచి ముద్దయ్యాయి. కాగా,

బుధవారం శ్రీరాముల మహేందర్‌కు చెందిన 115 బస్తాలు, పల్లెబోయిన రాజు 72 బస్తాలు, గాజె చిరంజీవి 150, గాజె తిరుపతి 35, కోలా చక్రపాణి 126, కోల మచ్చయ్య 32 బస్తాలు మొత్తంగా 520 మక్కల బస్తాలను లారీలో పరకాల ఏఎంసీ గోడౌన్‌కు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తరలించారు. గోడౌన్ ఇన్‌చార్జి లారీలో ఉన్న 180 బస్తాలను దింపుకొని మిగిలిన బస్తాలను మక్కల్లో తెల్ల పురుగులు వచ్చాయని, ఫంగస్ సోకిందని తిరిగి కొనుగోలు కేంద్రానికి పంపించారు. విషయం తెలుసుకున్న రైతులు.. గురువారం పురుగులమందు డబ్బాలతో కొనుగోలు కేంద్రానికి చేరుకొని లారీ ఎక్కి మక్కల బస్తాలను లారీ నుండి దిగుమతి చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. ఈ సందర్భంగా రైతు మహేందర్ మాట్లాడుతూ.. తనకున్న రెండు ఎకరాల్లో పంట సాగు చేయగా 115 బస్తాల మక్కలు వచ్చాయన్నారు. మే 8న కొనుగోలు కేంద్రం ప్రారంభించగా.. అప్పటి నుంచి 31వ తేదీ వరకు బస్తాల వద్ద పడిగాపులు కాశామని తెలిపారు. కొనుగోలు కేంద్ర నిర్వాహకులు కనీసం టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు కూడా సరఫరా చేయలేదని, తామే కొనుగోలు చేసి తెచ్చుకున్నామన్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లనే మక్కల బస్తాలు తడిచాయని, తిరిగి వచ్చిన లారీ నుండి బస్తాలు దిగుమతి చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దాంతో హమాలీలు గత్యంతరం లేక విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, సిఇఓ రాజమోహన్‌కు తెలియపరిచారు. రెండు మూడు రోజుల్లో బస్తాలను తిరిగి గోదాములకు పంపిస్తామని, అంతవరకు లారీలో ఉన్న బస్తాలను కేంద్రంలో దిగుమతి చేయాలని హమాలీలను చైర్మన్ శరత్ ఆదేశించారు.

25న పెళ్లి...జైలుకు వెళ్లను

- కోర్టులో రౌడీషీటర్ హంగామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోర్టులో ఓ నిందితుడు హల్‌చల్ సృష్టించాడు. ఈనెల 25న తన పెళ్లి ఉందని.. జైలుకు వెళ్లనంటూ హంగామా చేశాడు. కోర్టు లోపల డోర్‌కు ఉన్న అద్దాలు పగులకొట్టడంతో నిందితుడి చేతికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం నాంపల్లి కోర్టులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నిందితుడు ఆనంద్ అగర్వాల్ రౌడీ షీటర్. ఇప్పటికే అతనిపై 18 కేసులు నమోదయ్యాయి. ఇటీవల గంజాయి కేసులో శాలిబండ పోలీసులు అగర్వాల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు విచారణ సందర్భంగా అతనికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా తనకు పెళ్లి కుదిరిందని.. జైలుకు వెళ్లనని మొండికేశాడు. అంతటితో ఊరుకోకుండా కోర్టు లోపల డోర్ అద్దాలు ధ్వంసం చేశాడు. నిందితుడు అగర్వాల్‌పై గతంలోనూ పలు గంజాయి కేసులు నమోదయ్యాయి. ఓ మర్డర్ కేసు, దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నాడు. నెల రోజుల క్రితమే ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి విడుదల అయ్యాడు.

మావోయిస్టు కొరియర్లు అరెస్ట్..

- పేలుడు సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిషేధిత మావోయిస్టులకు సహాయ, సహకారాలు అందిస్తున్న ముగ్గురు కొరియర్లను ములుగు జిల్లా పోలీసులు గురువారం అరెస్టు చేసి వారివద్ద నుంచి పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత సీపీఐ మావోయిస్టులకు చెందిన అగ్రనాయకులు, దళ సభ్యులు వాజేడు గ్రామంలో రోడ్డు వర్క్ మిషన్లను తగల బెట్టేందుకు వ్యూహం వేశారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. వాహనాలను తగలబెడితే అటుగా వచ్చే పోలీసులను ల్యాండ్‌మైన్‌తో చంపివేయడానికి కుట్ర పన్నుతున్నట్లు సమాచారం అందిందని వెంకటాపురం సీఐ శివప్రసాద్ తెలిపారు. దీంతో పోలీసు బలగాలతో వాజేడు నుంచి గుమ్మడిదొడ్డి మార్గంలో ఫుట్ పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామ శివారులో ముగ్గురు అనుమానిత వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారని వివరించారు. వీరిని పోలీసులు పట్టుకుని విచారించగా వారి వద్ద పేలుడు పదార్థాలు లభించాయని పేర్కొన్నారు. వాజేడు మండలం ప్రగళ్లపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి నాగరాజు, ఏటూర్ నాగారానికి చెందిన వావిలాల నర్సింగరావు, అదే గ్రామానికి చెందిన ఎంపెల్లి జాషువా అనే ముగ్గురు కొరియర్లను అరెస్టు చేశామని వివరించారు. కొరియర్ల వద్ద నుంచి డిటోనేటర్లను, సెల్‌ఫోన్లను, విద్యుత్ తీగలు, బ్యాటరీలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. వాహనాలను తగుల బెట్టడానికి పెట్రోల్‌తో పాటు నగదును ఇచ్చిన గుమ్మడిదొడ్డిలోని పెట్రోల్ బంక్ ఓనర్ కంబాలపల్లి గణపతినీ అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

ఐటిలో దూసుకుపోతున్న తెలంగాణ

- టి-హబ్, టి-వర్క్స్‌తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- మహిళలకు ప్రత్యేకంగా వి-హబ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇది సమాచార సాంకేతిక విప్లవ యుగం. సాంకేతికత రోజురోజుకీ కొత్త రూపాన్ని సంతరించుకుంటున్న నేటి కాలంలో ఒక దేశ ప్రగతిని సాంకేతికత ప్రభావితం చేసినంతగా మరే అంశం ప్రభావితం చేయడంలేదు. సాంకేతికతను ఎంతగా అందిపుచ్చుకుంటే, ఆయా దేశాలు అంతగా అభివృద్ధిబాటలో పయనిస్తున్న తీరును మనం కళ్లారా చూస్తున్నాం. స్వరాష్ట్రం సాధించుకున్నాక ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో ఒక్కో రంగం ప్రగతి పట్టాలెక్కుతున్న క్రమంలో ఐటి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కెటిఆర్ ప్రపంచ సాంకేతికతను ఆకలింపు చేసుకుని ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా చేపడుతూ ఐటి రంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. రాజకీయ సుస్థిరత, సమర్థ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల పారిశ్రామిక విధానాలు 'బ్రాండ్ హైదరాబాద్'ను కాపాడటమే కాకుండా మునుపెన్నడూ ఎరుగని స్థాయిలో ఐటి రంగాన్ని వికసింపచేశాయి. భారత దేశపు ఐటీ రంగం స్థూల అభివృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధిరేటు ప్రతీ యేడూ అధికంగానే ఉంటూ వస్తోంది. ఆర్థిక వ్యవస్థపై కోవిడ్19 మహమ్మారి తీవ్ర ప్రతికూల ప్రభావాన్నీ తట్టుకుని తెలంగాణ ఐటీ రంగం పురోగమించింది. భారతదేశ సిలికాన్ వ్యాలీగా, ఐటి క్యాపిటల్ గా ప్రసిద్ధిగాంచిన బెంగుళూరును అధిగమిచేం దిశగా తెలంగాణ ఐటి రంగం దూసుకెళ్తోంది.

టి-హబ్ స్వరూపం-విజయ ప్రస్థానం

స్టార్టప్‌లను ప్రోత్సాహించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం టి-హబ్1, టి-హబ్ 2లను నెలకొల్పింది. ఈ వేదికలు నేడు తెలంగాణ రాష్ట్రానికి, ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి తలమానికంగా నిలిచాయి. సాంకేతికరంగంలో టి-హబ్‌లు సృష్టిస్తున్న అద్భుతాలు నేడు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

టి-హబ్ 1

'ఆలోచనలతో రండి, ఆవిష్కరణలతో వెళ్లండి' అనే నినాదంతో స్టార్టప్‌లకు ఇంక్యుబేటర్‌గా టీ-హబ్1ను 2015 నవంబర్ ఐదున గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా, గవర్నర్ నరసింహన్, రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇది 1800కి పైగా జాతీయ, అంతర్జాతీయ స్టార్టప్‌లకు సాంకేతికతను, ప్రతిభను, మెంటార్లను, కస్టమర్లను, కార్పొరేట్లను, ఇన్వెస్టర్లను, ప్రభుత్వ ఏజెన్సీలను అందించి లక్ష్యంతో ప్రారంభమైంది. టీ-హబ్ ద్వారా రాష్ట్రంలో ఐటీ ఇండస్ట్రీ బాగా అభివృద్ధి సాధిస్తోంది. అతి స్వల్ప సమయంలోనే టీ హబ్ దేశ విదేశాలలో ప్రముఖుల ప్రశంసలు పొందింది. టి-హబ్ వేదికగా ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంలో ఎంతో మంది యువ వ్యాపారవేత్తలు తమదైన రంగాల్లో బాగా రాణిస్తున్నారు.

టి-హబ్ 2

టి-హబ్ 1 సాధించిన విజయంతో ఆవిష్కరణలకు మరింత ఊతమిచ్చే లక్ష్యంతో టి-హబ్2ను ప్రారంభమైంది. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన టి-హబ్2ను 2022 జూన్ 28న సిఎం కెసిఆర్ ప్రారంభించారు. రూ.400 కోట్లతో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీ-హబ్2ను ప్రపంచలోనే అతిపెద్దదైన స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌గా భారీస్థాయిలో నిర్మించారు. దీని కోసం రూ.276 కోట్లను ఖర్చు అయ్యింది. ఆవిష్కరణ (ఇన్నోవేషన్), మౌలిక సదుపాయాలు (ఇన్ ఫ్రాస్ట్రక్చర్), సమ్మిళిత వద్ధి (ఇన్ క్లూజివ్ గ్రోత్) అనే 'త్రీ ఐ' సూత్రాలు అమలు చేయడమే లక్ష్యంగా టి-హబ్2ను స్థాపించారు.

టి ఫైబర్ ప్రాజెక్ట్ (ఫైబర్ గ్రిడ్ పథకం)

తెలంగాణ ప్రభుత్వ ఇంటింటికీ ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో టి-ఫైబర్ ప్రాజెక్ట్ (ఫైబర్ గ్రిడ్ పథకం)ను ప్రవేశపెట్టింది. దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకమిది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అందిస్తున్న ఆన్లైన్ సేవలను ప్రజలు సులువుగా పొందొచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు, వ్యాపార సంస్థలకు మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు డిజైన్ చేయబడిన టీ-ఫైబర్‌కు ఐసిటి ట్రాన్స్ఫర్మేషన్ అండ్ డిజిటల్ ఇండియా విభాగంలో నాలెడ్జ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (కెసిసిఐ) బిజినెస్ ఎక్సలెన్స్-2022 అవార్డు లభించింది.

టి-వర్క్స్

టి-వర్క్స్ ఎలక్ట్రానిక్, హార్డ్ వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అతిపెద్ద ప్రో టైపింగ్ సెంటర్. 'ఆలోచనలతో రండి.. ఆవిష్కరణలతో వెళ్లండి' అనే నినాదంతో టీ-వర్క్స్ రూపొందించారు. 'ప్రతి ఇల్లు ఒక ఆవిష్కరణ కేంద్రం' అనే సరికొత్త ఆలోచనల మేరకు ఉత్పత్తులను ఆవిష్కరింపజేయనున్నారు. వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే నమూనాలను రూపొందించేందుకు కెటిఆర్ ఆధ్వర్యంలో 2016లో హైదరాబాద్ బేగంపేటలో టీ-వర్క్స్ ప్రారంభించబడింది.

వి-హబ్

తెలంగాణ రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమం వీ హబ్ (ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ హబ్). 2018, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున హైదరాబాద్‌లోని అంబేద్కర్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కెటిఆర్ ప్రారంభించారు.

మహిళా వ్యాపారవేత్తలు స్థాపించే స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తూ అన్ని రకాల సహాయ సహకారాలను వీ-హబ్ అందిస్తోంది. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యూఎన్‌డీపీ, సీఐఐ-ఇండియా ఉమెన్ నెట్‌వర్క్, సేల్స్‌ఫోర్స్, ఐబీఎం బెంగళూరు, ఎన్‌విడియా, పీడబ్ల్యూసీ మొదలైన అనేక సంస్థల ప్రతినిధులు వీ హబ్ తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

వెలుగు జిలుగుల తెలంగాణ

- విద్యుత్ సరఫరాలో నెంబర్‌వన్
- 18,453 మెగావాట్లకు పెరిగిన విద్యుత్ స్థాపిత సామర్థ్యం
- 5,741 మెగావాట్ల సోలార్ విద్యుతు ఉత్పత్తి
- మరో మూడేళ్లలో అదనంగా 12,677 మెగావాట్లు
- కేంద్ర ప్రభుత్వ కుట్రలను, విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించాం
- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో గణనీయమైన పురోగాభివృద్ధి సాధించిందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు సందర్భంగా గురువారం సూర్యాపేటలో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత నుంచి వెలుగు జిలుగుల రాష్ట్రంగా తెలంగాణ కీర్తి నేడు దశ దిశలా వ్యాపించిందని అన్నారు. 2014కు ముందు విద్యుత్ కోతలతో సహా అనేక సమస్యలను రాష్ట్రం ఎదుర్కోగా.. నేడు రాష్ట్రంలో అలాంటి సమస్యలు లేకుండా ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టారని అన్నారు. విద్యుత్ కోతలను అధిగమించి.. మిగులు విద్యుత్ దశకు రాష్ట్రం చేరుకుందని తెలిపారు. వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగానికి సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.36,890 కోట్లు విడుదల చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 26.96 లక్షల వరకు ఉన్నాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నది తెలంగాణ రాష్ట్రం ఒక్కటేనని సంతోషం వ్యక్తం చేశారు. కరెంటు కోతలు, పవర్ హాలీడేలకు సిఎం సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం శాశ్వత ముగింపు ఇచ్చిందని తెలిపారు.

18,453 మెగావాట్లకు పెరిగిన విద్యుత్ స్థాపిత సామర్థ్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థనూ మెరుగుపరిచిందని జగదీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర విభజన నాటికి రాష్ట్రంలో స్థాపిత విద్యత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు మాత్రమే ఉండేదని ఇప్పుడు స్థాపిత సామర్థ్యం 18,453 మెగావాట్లకు పెరిగిందని వెల్లడించారు. ఇప్పుడు 16 వేల మెగావాట్లకు పైగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ వేసవిలో 15 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ వచ్చినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశామని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పరిశ్రమలు, కంపెనీలు పూర్తి సామర్థ్యంతో పని చేస్తుండటం వల్ల కార్మికులకు నిరంతరం ఉపాధి పొందుతున్నారని అన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలను మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం రూ.38,070 కోట్లు ఖర్చు చేసిందన్నారు.

మరో మూడేళ్లలో అదనంగా 12,677 మెగావాట్లు..

తెలంగాణలో పెరిగే విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని 28 వేల మెగావాట్లకు తీసుకుపోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రకటించారు. విభజన చట్టంలోని ఇచ్చిన హామీ మేరకు రామగుండంలోని ఎన్‌టిపిసి ద్వారా నాలుగు వేల మెగావాట్లకు కేంద్రం నుంచి ఆమోదం తీసుకున్నదని తెలిపారు. ఇప్పటికే మొదటి దశలలో 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు. నాలుగు వేల మెగావాట్ల యాదాద్రి ప్లాంటు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఛతీస్‌గఢ్ నుంచి రెండో దశలో మరో వెయ్యి మెగావాట్లు, సింగరేణి నుంచి మరో 800 మెగావాట్లు, సిఎన్‌జి ద్వారా 90 మెగావాట్లు, సోలార్ ద్వారా 1,584 మెగావాట్లు, హైడెల్ ద్వారా 90 మెగావాట్లు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వీటన్నింటి ద్వారా వచ్చే మూడేళ్లలో 12,677 మెగావాట్లు అదనంగా వచ్చి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

2,126 యూనిట్లకు పెరిగిన తలసరి విద్యుత్ వినియోగం..

తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని జగదీశ్‌రెడ్డి అన్నారు. 2014లో రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్లు మాత్రమే ఉండేదని అది 2021-22 నాటికి 2,126 యూనిట్లకు పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది మరిన్ని యూనిట్ల వరకు తలసరి వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు.

యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టుల నిర్మాణం..

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి అన్నారు. కోతల నుంచి మిగులు విద్యుత్ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండు పవర్ ప్రాజెక్టులను నిర్మిస్తోందని తెలిపారు. భద్రాద్రిలో 1080 మెగావాట్ల సామర్థ్యంతో 4 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. 800 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన కొత్తగూడెం ప్లాంట్‌లోనూ ఉత్పత్తి ప్రారంభమైందని చెప్పారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1200 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి నిర్మించిన ప్లాంటు కూడా ప్రారంభమైందని తెలిపారు. దీనికి అదనంగా 8,085 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్లలో టిఎస్ జెన్‌కో నిర్మిస్తున్న నాలుగు వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల యాదాద్రి పవర్ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు.

5,741 మెగావాట్ల సోలార్ విద్యుతు ఉత్పత్తి..

రాష్ట్రం ఏర్పడే నాటికి సోలార్ పవర్ కేవలం 74 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే ఉండేదని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల ఇప్పుడు రాష్ట్రంలో 5,741 మెవాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి జరుగుతోందన్నారు.

కేంద్రం కుట్రల నుండి విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించాం...

తెలంగాణలో కరెంట్ లేకుండా చేయాలని కేంద్రం చేసిన కుట్రలను, విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించామని మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. సింగరేణి సంక్షోభంలోకి వెళితే దక్షిణ భారతదేశ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ కుప్పకూలుతుందనే సంగతి ప్రధానికి తెలియదా అని ప్రశ్నించారు. సింగరేణి ప్రయివేటీకరణ అనేది కేవలం ఆరు జిల్లాల సమస్య కాదని, సమస్త తెలంగాణ అంశమని, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే భారీ కుట్రలో భాగంగానే ఇది జరుగుతోందని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న కెసిఆర్ సంకల్పాన్ని ఎలాగైనా దెబ్బ తీయాలన్న కేంద్రం కుట్ర ఇందులో దాగి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు, గౌరవాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం ఓర్వలేక పోతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తిని దెబ్బతీసి.. తద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కరెంట్ లేకుండా చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తెలంగాణ బలంగా అడ్డుకోవడం, మోటర్లకు మీటర్లు పెట్టమని తెగేసి చెప్పడంతో కేంద్రం దొడ్డిదారిలో సింగరేణిపై కన్నేసిందన్నారు. రాష్ట్ర అవతరణ తరువాత విద్యుత్ రంగంలో తెలంగాణకు పెద్ద దెబ్బ తగులుతుందన్న వాళ్లే..నిప్పుడు కరెంట్ కోతలు లేని తెలంగాణను చూసి ఆశ్చర్యపోతున్నారని అన్నారు. తీవ్రమైన విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న 16 ప్రధాన రాష్ట్రాల్లో సగానికి పైగా బీజేపీ పాలిత రాష్ట్రాలే ఉన్నాయన్నారు. తెలంగాణలో అప్పుడప్పుడు ట్రిప్పింగ్, ట్రాన్స్‌మిషన్ తో చిన్నపాటి అంతరాయాలు మినహా పెద్దగా కరెంట్ సమస్య లేదన్నారు.

దేశాంతరాన తెలుగు స్వరావధానంకు గుర్తింపు

ప్రజాశక్తి- కల్చరల్

ప్రముఖ సంగీత స్వరకర్త, గాయకుడు జిడి ప్రభాకర్ అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంగా నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాట్స్) అహ్వానం మేరకు న్యూ జెర్సీలో జరిగిన ఏడవ తెలుగు సంబరాలలో స్వరరాగా ఆవధానం చేశారు. రెండు ఘంటల పైగా జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్ తెలుగు సినిమా పాటలో రాగ విశ్లేషణతో పాటు శాస్త్రియ సంగీతంలోని మేలుకువలు పృచ్ఛకులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. డాక్టర్ దావుదపల్లి మధు కన్వీనర్‌గా వ్యవహరించగా వేణు ఓరుగంటి అప్రస్తుత ప్రసంగం, కాగా దేవులపల్లి సుధ, రేఖ, అరుణ గరిమెళ్ల రాధ కాశీనాధుని, జయ చిక్క, రవిలు ఇతర పృచ్ఛకులుగా పాల్గొన్నారు. నాట్స్ అధ్యక్షుడు బాపయ్య సాహితీ వేదిక అధ్యక్షుడు మధు రాచకల్లులు ప్రభాకర్‌ను సత్కరించారు.

1945-75 మధ్యకాలం తెలుగు సినిమా చరిత్రలో స్వర్ణయుగం

- సినీ ప్రముఖుల అభిభాషణ

ప్రజాశక్తి - కల్చరల్

మూడు దశాబ్దాల కాలం 1945 నుంచి 1975 వరకూ తెలుగు సినిమా చరిత్రలో స్వర్ణయుగమని ఎందరో మహనటులను సాంకేతిక నిపుణులను భారతీయ సినీ పరిశ్రమకు అందించిందని పలువురు సినీ ప్రముఖులు అభిభాషించారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా దర్బార్ నిర్వహణలో ప్రఖ్యాత నటుడు కృష్ణ 80వ జయంతి ఉత్సవం జరిగింది. ముఖ్యఅతిధిగా ప్రముఖ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణ నిర్మించిన ప్రతి సినిమా కొత్త ఒరవడికి నాంది అన్నారు. ఆయన సినిమాలు వినోదంతో పాటు సామాజిక ప్రయోజనం మిళితంగా వుంటాయని వివరించారు. నటుడు మురళిమోహన్ మాట్లాడుతూ నిర్మాతల శ్రేయస్సు కోరే నటుడు కృష్ణ అని ఆయన ఒకే రోజు పదికి పైగా సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్న సందర్భాలు ఉన్నాయన్నారు. నటుడు చంద్రమోహన్ మాట్లాడుతూ స్నేహశీలి అజాత శత్రువు కృష్ణ ఉత్తమ సంస్కారి అని పేర్కొన్నారు. అనంతరం సంస్థ స్థాపకుడు పొత్తూరి రంగారావు నిర్వహణలో మురళీమోహన్, చంద్రమోహన్ దంపతులు, భాను చందర్, నటి కవిత, ప్రభ తదితరులకు కృష్ణపేరిట సినీ అవార్డులను బహుకరించారు. వంశీ రామరాజు, డైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రైల్వే లైను పనుల్లో జాప్యం వద్దు

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్ధిపేటకు వీలైనంత తొందరలో రైలు కూత వినిపించాలని, యుద్ధప్రాతిపదికన ట్రాక్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌ను మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. రైల్వేట్రాక్ పనుల్లో జాప్యం జరుగొద్దని, పనుల వేగం పెంచాలని సూచించారు. సిద్ధిపేట శివారులోని మందపల్లి నుంచి రైల్వేట్రాక్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సంతోశ్ కుమార్‌తో కలిసి మంత్రి గురువారం పరిశీలించారు. దుద్దెడ నుంచి సిద్ధిపేట వరకు చేపట్టిన ట్రాక్ నిర్మాణ పనులు గురించి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మందపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ జాప్యంపై మంత్రి హరీశ్ రావు ఆరా తీశారు. పనులు జరుగుతున్న తీరును తెలుసుకుని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎపి అక్రమాలను నిరోధించండి

- కెఆర్ఎంబికి తెలంగాణ సర్కారు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని సాగునీటి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ కృష్ణా నది యాజమాన్య బోర్డు(కెఆర్ఎంబి)కి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ ప్రత్యేకంగా లేఖ రాశారు. ప్రధానంగా మూడు అంశాలను అందులో ప్రస్తావించారు. కెఆర్ఎంబిలో చేసిన నిర్ణయాలు, తీర్మానాలకు విరుద్ధంగా సాగునీటి వ్యవహారాలు జరుగుతున్నాయని బోర్డు దృష్టికి తెచ్చారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ప్రభుత్వం చెబుతున్నట్టుగా 50:50 నిష్పత్తిలో కృష్ణాజలాలను పంపిణీ చేయాలని కెఆర్ఎంబి చైర్మన్‌నుకోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ప్రాజెక్టులను నిర్మిస్తున్నదని చెప్పారు. పలుమార్లు ఆ ప్రభుత్వానికి, కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని లేఖలో పేర్కొన్నారు. కెఆర్ఎంబి దృష్టికి కూడా అనేకమార్లు తెచ్చామని వివరించారు. ఇకపోతే 2022-23 నీటి సంవత్సరంలో ఏపీ అదనంగా నీటి వినియోగం చేపట్టిందని అన్నారు. ఈ చర్య తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేస్తుందని గుర్తు చేశారు. ఈ మూడు అంశాలపై కెఆర్ఎంబి దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

9 నుంచి గొర్రెల పంపిణీ ప్రారంభం

- మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 9 నుంచి గొర్రెల పంపణీ కార్యక్రమాన్ని నకిరేకల్ నియోజకవర్గంలో ప్రారంభించనున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. గొర్రెల పంపిణీ, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్, దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సమీక్షించారు. గొర్రెల అభివృద్ధి పథకం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాల బ్రోచర్లను స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఆధార్ సిన్హాతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. 8వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. గొర్రెల యూనిట్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఒరిగిందేమిటి?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షను విడనాడాలి
- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి
- సిఎం కెసిఆర్‌కు ఎస్‌సికెఎస్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ వేతనాలను కోల్పోయి మరీ తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న 25 వేల మంది సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వంగానీ, సింగరేణి యాజమాన్యంగానీ చేసిందేమీ లేదని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు పేర్కొన్నారు. జెబిసిసిఐలో చేసిన నిర్ణయాలను సింగరేణిలో అమలు చేయించడంలో కేంద్ర ప్రభుత్వం, బొగ్గుమంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. సింగరేణికి లాభాలు గడించిపెట్టడంలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష తగదన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పర్మినెంట్ కార్మికులకు స్వీట్లు పంచుతున్న సింగరేణి యాజమాన్యానికి కాంట్రాక్టు కార్మికులు పట్టరా? అని ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగానైనా కాంట్రాక్టు కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై సిఎం కెసిఆర్ జోక్యం చేసుకోవాలని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు బి మధు బహిరంగ లేఖ రాశారు. అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నేరుగా వేతనాలు చెల్లించడం ద్వారా సింగరేణికి నెలకు రూ.50 లక్షలు ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోల్ ఇండియా నిర్ణయించిన వేతనాన్నయినా, జిఒ 22ని అయినా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో చెల్లించిన విధంగా రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. సింగరేణిలో లాభాల వాటా లేదా చట్ట ప్రకారం 20 శాతం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 26-09-2022న సింగరేణి యాజమాన్యం చేసిన ఒప్పందంలోని అన్ని అంశాలను అమలు చేయాలని కోరారు. సింగరేణి హాస్పిటల్స్‌లో కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని, లేదంటే ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఖాళీ క్వార్టర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని కోరారు. కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని కోరారు.



ఒంటి కాలుపై కార్మికుల నిరసన

- జిఒ నంబర్ 60ను అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కనీస వేతనాలు అమలు చేయాలని, జిఒ నంబర్ 60 అమలు చేయాలని కోరుతూ నాగర్ కర్నూలు జిల్లా జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఆందోళన చేశారు. గురువారం జనరల్ ఆస్పత్రి వద్ద వంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారికి మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ.. దాదాపుగా 35 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నా.. వేతనాల పెంపు విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కనీస వేతనాల జిఒ 60ను అమలు చేయాలని, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగస్టులో జీవో అమలు చేసి వేతనాలు పెంచాలంటే.. ఇద్దరు కాంట్రాక్టర్ల గొడవతో కార్మికులు పది మాసాల వేతనం రూ.16,500 కోల్పోయారని తెలిపారు. దీని మూలంగా కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కేవలం 32 మంది సిబ్బంది 330 పడకల ఆస్పత్రిని ఏ విధంగా శుభ్రం చేస్తారని ప్రశ్నించారు. టెండర్ ప్రక్రియ తొందరగా ముగిసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కార్మికులకు రావాల్సిన రూ. 16,500 వేతనం వెంటనే ఇవ్వాలని, అదనపు సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలకృష్ణమ్మ, రాధ, శాంతమ్మ, బాలమణి, అలివేల, నిరంజన్, గిరి, వెంకటేష్, శేఖర్ బాలకృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకులు.. ఐవి సుబ్బారెడ్డికి.. 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ సైన్స్, ఫిజిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఐవి సుబ్బారెడ్డికి ఎపిజె అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ (జీవితకాల సాఫల్య) అవార్డు వచ్చింది. బెంగళూరులోని సామాజిక, ఆర్థికాభివృద్ధి జాతీయ విద్యా సంస్థ ఇటీవల ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును ఇచ్చి సత్కరించినట్టు గీతం వర్గాలు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి. దేశాభివృద్ధి, బోధన, పరిశోధన, పత్ర సమర్పణలో డాక్టర్ ఐవి చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ఇచ్చినట్టు తెలిపారు. అడ్వాన్స్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ సైన్స్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ నుంచి సీనియర్ రీసెర్చ్ ఫెలోతో పాటు సిఐఎస్ఆర్ నుంచి యంగ్ అండ్ డైనమిక్ రీసెర్చ్ స్కాలర్‌గా డాక్టర్ రెడ్డి ఇంతకు మునుపు గుర్తింపు పొందినట్టు తెలిపారు. జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ సుబ్బారెడ్డిని స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ దత్తాత్రి కె నగేష్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి విశ్వం ఆయనను అభినందించారు.

సాగునీటి ప్రాజెక్టులతో సత్ఫలితాలు

- రూ.1.55 లక్షల కోట్ల వ్యయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటికి, మనిషి జీవితానికి అవినాభావ సంబంధమనేది అందరికి తెలిసిందే. అది సాగునీరు కావచ్చు. తాగునీరూ కావచ్చు. రాష్ట్ర అవతరణ అనంతరం గులాబీ సర్కారు సాగునీటిపై చేసిన సమరం నెమ్మదిగా ఫలితాలు తీసుకొస్తున్నాయి. అందులో సాగునీటి అవసరం ఎలాంటిదో తెలియనిది కాదు. నేడు తెలంగాణ దేశ రైస్ భాండాగారంగా అవరించడం వెనుక ఎంతో కృషి, కసరత్తు, తపన ఉన్నాయి. కుదేలైన సాగునీటి రంగ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు దేశానికే దిక్సూచిగా నిలిచాయి.

2014లో రాష్ట్ర అవతరణ తర్వాత సాగునీటి రంగానికి ఊతమిచ్చేందుకు సర్కారు పలు సాహసోపేతమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. సాగునీటి పారుదలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో గత తొమ్మిదేళ్లుగా రాష్ట్ర నీటి పారుదల వ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతోంది. ఎంతో శ్రమ, మరేన్నో మైలురాళ్లు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల కార్యాచరణ, మీడియా సహకారం వెరసీ దేశంలోనే తెలంగాణను ప్రత్యేక స్థానంలో నిలిపింది. నీటి ప్రాజెక్టుల రూపకల్పన, వాటిని నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేయడం మాటల్లో చెప్పడం కష్టమే. ఈ క్రమంలో ఏన్నో సమావేశాలు, వర్క్‌షాప్‌లు, మేథోమథనం చోటుచేసుకుంది. తద్వారా శరవేగంగా నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫలితంగా ప్రాజెక్టులన్నీ నేడు సరికొత్త రూపును సంతరించుకున్నాయి. అలాగే పాత ప్రాజెక్టులను విప్లవాత్మక రీతీలో ఆధునీకరించటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. నీటి పారుదల రంగంలో వచ్చిన అద్భుతమైన అభివృద్ధితో తెలంగాణ ఇప్పుడు కోటిన్నర ఎకరాల మాగాణంగా అవతరించింది. రాష్ట్రానికి ప్రధాన నీటివనరులు గోదావరి, కృష్ణా ప్రధాన నదులు. ఈ రెండూ కలిపి రాష్ట్రానికి 1266.44 టిఎంసిల జలాలు అందుబాటులో ఉంటాయి.

కాళేశ్వరం ప్రాజెక్టు

ప్రపంచంలో ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో అతి పెద్దదైన, భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరంను తెలంగాణ ప్రభుత్వం రికార్డు సమయంలో నిర్మించింది. కాళేశ్వరం కింద 19.63 లక్షల ఎకరాల ఆయకట్టును సృష్టించి, 18.83 లక్షల ఎకరాలను స్థిరీకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. 13 జిల్లాలు, 31 నియోజకవర్గాలు, 121 మండలాలు, 1698 గ్రామాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరించి ఉంది. దిని కింద మూడు ఆనకట్టలు, 22 లిఫ్టులు, 21 భారీ పంపహౌజులు, 15 రిజర్వాయర్లు, 203 కిలోమీటర్ల సొరంగమార్గాలు, 1531 కిలోమీటర్ల పొడవున కాలువలు, 36 నెలల స్వల్ప వ్యవధిలో నిర్మించారు. ప్రపంచ ఇంజినీరింగ్ అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రఖ్యాతి పొందిందని సర్కారు చెబుతోంది. దీని ద్వారా సముద్ర మట్టం నుంచి 618 మీటర్ల ఎత్తుకు గోదావరి జలాలు ఎత్తిపోయడం జరుగుతోంది. 45 లక్షల ఎకరాల్లో రెండు పంటలకు సాగునీరందిస్తున్న ఈ పథకం, తెలంగాణ గ్రోత్ ఇంజన్‌గా మారింది. దీంతోపాటు చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దేవాదుల, తుపాకుల గూడెం, సమ్మక్క-సారక్క ప్రాజెక్టు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సత్ఫలితాలనిస్తున్నాయి.

కేంద్రం వివక్ష

కేంద్రంలోని బిజెపి సర్కారు తెలంగాణ పట్ల పూర్తిగా వివక్షను ప్రదర్శిస్తోంది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినా పటించుకోలేదు. కాగా ప్రాజెక్టులపై కెఆర్ఎంబి, జిఆర్ఎంబి పేరుతో పెత్తనం చేస్తున్నది. అంతేగాక నిర్వహణ కోసం రెండు తెలుగు రాష్ట్రాలు రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలి షరతు పెట్టింది. అపెక్స్ కౌన్సిల్ నిర్వహించకుండా సాగునీటి సమస్యలను పెండింగ్‌లో పెట్టింది. బిజెపి రాష్ట్రాలకు నిధులు విరివిగా కేటాయిస్తోంది.

కెసిఆర్ పథకాలతో బిజెపి, కాంగ్రెస్‌లకు మైండ్ బ్లాక్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో బిజెపి, కాంగ్రెస్ నాయకులకు మైండ్ బ్లాక్ అయిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అజేయ శక్తి గా తెలంగాణ అవతరించిందన్నారు. దేశం అభివృద్ధిపై కెసిఆర్ మార్క్ ఉండడంతో బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో మరోసారి అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, మూడోసారి ముఖ్యమంత్రిగా కెసిఆర్ ఉంటారని అన్నారు. కాంగ్రెస్, బిజెపిల చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని, ఇది హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల్లోను రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందం జరిగిందని అన్నారు. అభివృద్ధిలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విజన్ గల నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని పేర్కొన్నారు.రమణ, మాధవి తదితరులు అలనాటి పాటలను హృద్యంగా ఆలపించారు.

వీధి వ్యాపారులకు రుణాలు అందించడంలో తెలంగాణ టాప్

- రాష్ట్రానికి కేంద్ర అవార్డులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవడంలో తెలంగాణ రాష్ట్రం పెద్ద రాష్ట్రాల కేటగిరిలో ముందు వరుసలో నిలిచింది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హిర్దిప్ సింగ్ పూరి చేతుల మీదుగా తెలంగాణ అధికారులు అవార్డు అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి , మెప్మా ప్రాజెక్టు మేనేజర్ చైతన్యలు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులను కేంద్ర మంత్రి అభినందించారు. దేశంలో పెద్ద రాష్ట్రాల కేటగిరిలో తెలంగాణ, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు అవార్డులను అందుకున్నాయి. వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చే పీఎంస్వాన్ నిధి ప్రారంభించి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానంచేశారు.

తెలంగాణ ప్రభుత్వం పట్టణ ప్రగతిలో భాగంగా వీధి వ్యాపారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పించాలని 2020 ఫిబ్రవరి 16న సిఎం కెసిఆర్ ఆదేశించారు. వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలపై స్టాంప్ డ్యూటీని కూడా రాష్ట్ర ప్రభుత్వం మినహాయించింది. మొదటి విడతలో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ. 3.40లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో 3,58,776 (106శాతం) వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు కాగా 3,56,678 మందికి రూ.353.17 కోట్లను పంపిణి చేశారు. మొదటి విడత రుణాల పంపిణిలో 100 శాతం లక్ష్యాన్ని చేరి తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

టాప్‌లో తెలంగాణ పట్టణాలు....

లక్ష జనాభా ఉన్న పట్టణాల కేటగిరిలో దేశ వ్యాప్తంగా 3555 పట్టణాలు ఉండగా ఈ కేటగిరిలో టాప్ 10 పట్టణాలు తెలంగాణలో ఉన్నాయి. మొదటి స్థానంలో సిద్దిపేట, రెండో స్థానంలో సిరిసిల్ల పట్టణం, నిర్మల్, కామారెడ్డి, బోధన్, జహీరాబాద్, సంగారెడ్డి, మంచిర్యాల, పాల్వంచ, ఆర్మూర్ పట్టణాలు టాప్ పదిలో నిలిచాయి. లక్ష నుంచి 10 లక్షల జనాభా కేటగిరిలో దేశంలో 442 పట్టణాలు ఉండగా వరంగల్ దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా, నిజామాబాద్ 10వ స్థానంలో ఉంది. 40లక్షల పైగా ఉన్న జనాభా కేటగిరిలో జీహెచ్ఎంసీ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది.

రెండో విడత రుణాల పంపిణిలో భాగంగా మొదటి విడత రుణాన్ని తిరిగి చెల్లించిన వారికి ఒక్కొక్క వీధి వ్యాపారికి రూ.20వేలు అందించారు. 1,45,100 మందికి రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా 1,53,306 మందికి(106శాతం) మంజూరు చేశారు. ఇందులో 1,46,692 రుణాలను పంపిణి చేశారు. లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాల కేటగిరిలో టాప్ 10 పట్టణాల్లో 10 తెలంగాణకు చెందినవే ఉన్నాయి. లక్ష నుంచి 10లక్షల జనాభా ఉన్న పట్టణాల కేటగిరిలో వరంగల్ మొదటి స్థానంలో నిలవగా, నిజామాబాద్ రెండో స్థానంలో, కరీంనగర్ మూడో, రామగుండం 10వ స్థానంలో ఉన్నాయి.

40లక్షల జనాభా దాటిన కేటగిరిలో గ్రేటర్ హైదరాబాద్ దేశంలో 2వ స్థానంలో నిలిచింది.

వీధి వ్యాపారులకు మూడు విడుతల్లో ఇప్పటి వరకు రూ.695.42కోట్లను పంపిణీ చేశారు.

40లక్షల జనాభా దాటిన కేటగిరిలో గ్రేటర్ హైదరాబాద్ దేశంలో మొదటివ స్థానంలో నిలిచింది.